COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

తేది : మార్చి 1, 2016
విజయవాడ.

# హామీలపై నీళ్ళు చల్లిన బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను ఏమాత్రం పట్టించుకోలేదు. రాజధాని నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి పూర్తి చేస్తామని చట్టంలో హామీ ఇచ్చారు. కాని అందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించక పోవడాన్ని సిపిఎం రాష్ట్రకమిటి తీవ్రంగా తప్పు పడుతున్నది.

ఏపి పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాజభవన్, హైకోర్టు, సచివాలయం, శాసన సభ, శాసనమండలి తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు కేంద్రం ప్రత్యేకంగా ఆర్థిక సహాయం చేయాలి. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, అదే విధంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు కోరాపూట్ – బొలాంగిర్ – కలహండి, బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజి ఇవ్వడం, జాతీయ స్థాయి విద్యాసంస్థలు నెలకొల్పడం లాంటివి ఉన్నాయి. ఈ నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి 4 వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి 4 వేల కోట్లు, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి, ప్రత్యేక హెూదా కల్పించాలని కోరింది. అదే విధంగా గత సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌లో లోటు పూర్తి చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న 13 వేల కోట్లలో కనీసం 6,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని మిగిలినది బడ్జెట్‌లో కేటాయించాలని రాష్ట్రం కోరింది.

అయితే ఈ ఏడాది బడ్జెట్‌లో రాజధాని నిర్మాణం గురించి ఊసే లేదు. అలాగే వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయల సీమ జిల్లాలకు ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజి గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావన కూడా చేయలేదు. లక్షలాది మంది గిరిజనులను నిర్వాసితులను చేయకుండా పోలవరం ప్రాజెక్టు డిజైన్ మార్చి నిర్మించాలని భిన్నాభిప్రాయాలున్నా కేంద్రం లెక్క చేయకుండా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి 4 ఏళ్ళలో పోలవరం పూర్తి చేస్తామన్నారు. పెరిగిన అంచనాల ప్రకారం 36 వేల కోట్లు అవసరమైన పోలవరంకు 100 కోట్లు మాత్రమే కేటాయించారు. అదే విధంగా విశాఖ మెట్రో రైలుకు కేవలం 3లక్షలు, సెంట్రల్, ట్రైబల్ యూనివర్సిటీకి చెరో కోటి రూపాయలు, పెట్రోలియం యూనివర్సిటీకి 2 కోట్లు కేటాయింపులు చేశారు. గత ఏడాదికి బడ్జెట్ లోటును పూడ్చుకోవడానికి కేంద్రం ఇవ్వాల్సిన 13 వేల కోట్ల గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. ఇది రాష్ట్రం పట్ల కేంద్రానికి ఉన్న పక్షపాత ధోరణి తప్ప మరొకటి కాదు.

బడ్జెట్‌లో కేంద్రం రాష్ట్రానికి చాలీచాలని నిధులతో తీవ్ర అన్యాయం చేసింది. కేంద్రంలో అధికారం పంచుకుంటున్న టిడిపి రాష్ట్రానికి రావాల్సిన నిధులను బడ్జెట్‌లో సాధించుకోవడంలో విఫలమైంది. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం పట్ల పక్షపాత ధోరణి విడనాడి రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్‌లో సవరణలు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. ప్రజాతంత్ర వాదులంతా కేంద్రం వైఖరిని ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

(పెనుమల్లి మధు)
రాష్ట్ర కార్యదర్శి